# మినీ కథ

"వహా బాస్ సుబ్బారావుగారు వూరు నుంచి వచ్చారుట. సాయంత్రం ఒకసారి వాళ్ళింటికి వెడదాం రెడీగావుండు" అన్నాడు ఆఫీసుకు వెళ్ళడానికి స్కూటరు స్టార్టుచేయబోతున్న సుకుమార్, భార్య సునీతతో.

"టూర్ నుంచి వస్తే మనం చూడడం ఎందుకూ ?" అర్థంకానట్లు అడిగింది.

"ఏదో ఫార్మాలిటీ— నాలుగు కుశల ప్రశ్నలువేసి కాస్త పొగిడివస్తే మంచిది గదా. అప్పుడే అందరూ వెళ్ళివచ్చారు."

"ఏమో బాబూ—ఎల్.టి.సి. మీద వెడితే ఈ పరామర్శలూ, సన్మానాలూ ఎందుకో తెలియదు. పైగా ఆవిడ తెగ బోరుకొడుతుంది" విసుగ్గా అంది.

"ఏం చేస్తాం. కాస్తభరించాలి. అందుకు పరిహారంగా నీకు సినిమా చూపిస్తాగా—" బేరం చేయడం మొదలెట్టాడు.

"ఆవిడ నాకే బాస్ అయినట్లుగా ఫోజు కొడుతుంది. నేను భరించలేను బాబూ-"

"అలాకాదు — నా కోసం కాస్త భరించాలి. ఈ మాత్రం చేయకపోతే చాలా అఫెండు అవుతాడు. రేపటినుంచి రాచి రంపాన పెడతాడు ఆ త్రాష్టుడు." భయం తోనేతప్ప, ప్రేమతో కాదన్నట్టుగా వుంది సుకుమార్ గొంతు.

"సరేలెండి" తలూపింది.

సాయంత్రం అనుకున్నట్లుగానే, ఆఫీసర్ సుబ్బారావుగారి యింటి ముందు స్కూటర్ దిగారు సుకుమార్ దంపతులు — డ్రాయింగ్ రూమ్‌లో సుబ్బారావుగారు చాలా మందితో మాట్లాడుతున్నారు. సునీత అమ్మగారిని పలకరించడానికి లోపలకు వెళ్ళింది.

సుబ్బారావుగారు వారు చూసిన స్థలాలూ, పొందిన అనుభవాలూ, వాళ్ళావిడ చేసిన సాహసకృత్యాలు వగయిరా వగయిరా గురించి వర్ణిస్తూ మధ్య మధ్యలో వేస్తున్న జోకులకి వచ్చినవాళ్ళు నవ్వాలని నవ్వుతున్న నవ్వులతో మంచి కోలాహలంగా వుంది ఆ గది.

"రా....సుకుమార్.... ఏమిటోయ్ కంట్లో నలుసైపోయావ్ ?" అన్న సుబ్బారావుగారి మాటల్లోని ఎత్తిపొడుపు యిట్టే గ్రహించాడు సుకుమార్. "నిన్ననే వద్దామనుకున్నా సార్.... నిన్న సాయంకాలం మావూరునుంచి ఫ్రెండ్సు వచ్చారు సార్. వాళ్ళని ఈరోజు సిటీ చూడడానికి పంపించి, యిలా వచ్చాను సార్" సంజాయిషీ చెప్తున్నట్లుగా మెల్లిగా చెప్పి, కుశల ప్రశ్నలలోకి దిగాడు.

"ప్రయాణం బాగా జర్గిందా సార్ ?"

"బాగానే జర్గిందోయ్. మా ఆవిడ పట్టుబడితే విసుక్కున్నా. కానీ కారు మీద పోవడంవల్ల ప్రయాణం చాలా సుఖంగా జర్గిందోయ్.... రియల్లీ ఊటీలో రెండు రోజులుండేసరికి అలసటా గట్రా మాయమైపోయాయ్. వెరీ వెరీ నైస్ ప్లేస్. మీ మేడమ్‌కి (ఆయన భార్యకి) జలుబు చేసిందోయ్. మిడ్ సమ్మర్లో కూడా అంత చిల్డుగా వుందోయ్ ఎట్మాస్ఫియర్."

"లక్కీ సార్, అక్కడే నాలుగైదు రోజులుండవలసింది సార్. ఫామిలీ బాగా ఎంజాయ్ చేసేవారు" ప్రయిజింగ్‌గా అన్నాడు.




ఆయన నవ్వేశారు.

"అక్కడ పిక్చర్ షూటింగ్ ఏదన్నా చూశారా సార్ ?" కుతూహలం నటిస్తూ అడిగాడు.

"లేదోయ్— ఏదో టామిల్ పిక్చరో, తెలుగు పిక్చరో షూట్ చేస్తున్నారు. పిల్లలు హిందీ పిక్చరవుతేనేగానీ చూడమన్నారు."

"అక్కడ స్టేకి యిబ్బంది కలగలేదుగదా సార్" మరో కుశలప్రశ్న.

"లేదోయ్—అభిరామ్ అని మంచి హోటలుంది. దాంట్లో దిగాం. చాలా కంఫర్టబుల్‌గా వుంది. రేట్సు మాత్రం జాస్తిఅనుకో కంఫర్ట్సు కావాలి డబ్బు మిగలాలి అంటే కుదరదుగా. అఫ్‌కోర్స్ నేను డబ్బుకు లెఖ్ఖ పెట్టనుగా."

సొంతసొమ్ములు కాకుండా, అప్పనంగా వచ్చే సొమ్ములంటే నేనూ లెక్కపెట్టనను కున్నాడు సుకుమార్.

"అన్నట్టు. ఆ హోటల్ అభిరామ్‌లో.."

ఆయన మాటలు పూర్తికాలేదు.

"అభిరామ్ కాదు డాడీ— హోటల్ జయరామ్" ఎప్పుడొచ్చాడో, బాస్‌గారి అబ్బాయి గారాలపట్టి వచ్చి, బాస్‌గారిని 'కరెక్టుచేశాడు.

**సి. నరసింహాచార్యులు**

"కాదురా.... అది హోటల్ అభిరామ్" ప్రెస్టేజీ ఫీలవుతూ చెప్పారు బాస్.

"కాదు. అది హోటల్ జయరామ్" కుమారుడు అంతకన్నా ఎప్సర్టివ్‌గా చెప్పాడు.

"కాదురా- ఐ రిమెంబర్ వెరీవెల్. అది హోటల్ అభిరామ్" తండ్రి మాట పూర్తి కాకుండానే "ఆగు యిప్పుడే వస్తా" అంటూ ఇంట్లోకి తుర్రుమన్నాడు కుర్రాడు.

"ఇంతకీ ఆ హోటల్లో ఏమయిందండీ?" సస్పెన్సు స్టోరీ వింటున్నంత ఆసక్తిగా అడిగాడు సుకుమార్.

ఇంతలో బాస్‌గారి సుపుత్రుడు, చెరో చేత్తో చెరో స్పూనూ పట్టుకొని, పరుగెత్తుకొంటూ వచ్చాడు.

స్పూనులు ధగధగా మెరుస్తున్నాయ్. వెండి చెంచాల్లా వున్నాయ్. చాలా అందంగా వున్నాయ్.

"చూడు నాన్నా — వీటి మీద పేర్లు 'హోటల్ జయరామ్' అని వున్నాయో లేవో ?" నిగ్గదీసి అడిగాడు.

"ఏమిట్రా యివి ?" బాస్‌గారు కంగారుగా అడక్కూడదనుకుంటూనే నోరుజారి అడిగారు. అంతే! సుపుత్రుడు ఆటంబాంబు పేల్చాడు.

"మనం దిగిన హోటల్లోంచి అమ్మ నాలుగు స్పూన్లూ, రెండు చిన్న ప్లేట్లూ పట్టుకొచ్చిందిగా. యివిగో వీటిమీదహోటల్ పేరుకూడా వుందిచూడు కావలిస్తే" అంటూ సాక్ష్యాధారాలు జడ్జీగారి ముందుపెట్టి, ముద్దాయికి హేంగింగ్ వేయమంటూ వాదించే ప్రాసిక్యూటరులా నిలబడ్డాడు పుత్రరత్నం.

కుమార రత్నం చేతిలో వున్న రెండు చెంచాలూ, బాస్‌గారి బాధని నిర్లక్ష్యం చేస్తూ "హోటల్ జయరాం" పేరుతో ధగధగా మెరుస్తున్నాయి.

ఏమంటే ఏమవుతుందో అని సుకుమార్ గుండె బిక్కుబిక్కు మంది. బాస్‌గారు నోటమాట రాక వాటికేసి చూస్తూ అలానే వుండిపోయారు.